క్లుప్తంగా

భక్తి భావాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంపొందించుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఛత్రం పంచాయతీలో గురువారం చెన్నకేశవస్వామి ఉత్సవాలు జరిగాయి. బుళ్లసముద్రంలో నాయకులతో కలిసి సమన్వయకర్త ఈరలక్కప్ప పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రజలు కలిసి మెలసి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నాయకులతో కలిసి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ మల్లికార్జున, వివిధ విభాగాల అధ్యక్షులు సుధాకర్, నరసింహ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శివకుమార్, శ్రీనప్ప, రామకృష్ణ, చంద్రశేఖర్, నరసన్న, రంగనాథ్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెప్పశెట్టిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

చిలమత్తూరు: భూఆక్రమణదారుడు, రైతులు, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నేత వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం కోడూరు సమీపంలోని రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌ను సీపీఐ నేతలతో కలిసి పరిశీలించారు. అక్రమంగా వేసిన కంచె తొలగించి, ప్లానింగ్ ప్రకారం రైతులకు దారి వదలాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. రెడ్డెప్పశెట్టి చేసిన అక్రమాలపై సాక్షిలో కథనాలు రావడంతో అధికారులు అక్రమణలు తొలగించాలని ఎవిక్షన్ నోటీసులు ఇచ్చారన్నారు. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. చర్యలు తీసుకోకపోతే దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

మురళీనాయక్ కుటుంబానికి పరామర్శ



ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

గోరంట్ల: ఆపరేషన్ సిందూరులో అశువులు బాసిన వీర జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని కర్నూలు జిల్లా ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. జవాన్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జోతిబాయిలను ఓదార్చారు. వారికి సాయిప్రసాద్‌రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మురళీనాయక్ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు నారాయణప్ప (ఫైల్)

పావగడ: తాలూకాలోని సుంకార్లకుంటలోని ఓ పెట్టి అంగడి దగ్ధమైన ఘటనలో యజమాని నారాయణప్ప (50)కు తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నారాయణప్ప బెంగళూరు విక్టోరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి

హిందూపురం: నియోజకవర్గ వ్యాప్తంగా చదువుకుంటున్న విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ కోరారు. గురువారం ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది విద్యార్థులు హిందూపురం పట్టణానికి చదువుకునేందుకు వచ్చి వెళ్తుంటారన్నారు. పేద విద్యార్థులు ఇబ్బందులు పడకుండా బస్సులు నడపించాలని కోరారు. అలాగే బస్‌పాస్ కౌంటర్‌లో అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కన్వీనర్ అఫ్రిది, కో-కన్వీనర్ అజ్మల్, ఇస్మాయిల్, ఉమేష్, రాజిక్ పాల్గొన్నారు.

కార్మికుల వేతన వెతలు

- పారిశుధ్య కార్మికులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- ఆరు నెలలుగా జీతాలందక అవస్థలు
- మంజూరుకాని 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు



పిసి గిరిలో రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

గుడిబండ: నియోజకవర్గంలోని పంచాయతీల పరిశుభ్రతకు పాటుపడుతున్న పారిశుధ్య కార్మికులు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు బాధ్యతగా గ్రామ వీధుల్లో ఉండే చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి ఊరి బయట ఉన్న డంపింగ్ యార్డులకు తరలిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వేతనాలు అందక కుటుంబం గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 65 పంచాయతీలకు 201 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. గుడిబండ మండలంలో 53 మంది పారిశుధ్య కార్మికులు, అమరాపురం మండలంలో 28 మంది, రొళ్ల మండలంలో 29 మంది, అగళి మండలంలో 31 మంది, మడకశిర రూరల్ మండలంలో 40 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు రాక పోవడం వారికి ఇబ్బందిగా మారింది. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం వారిని ఇబ్బంది పెడుతోంది. గత ప్రభుత్వంలో సమయానికి జీతాలు అందేవని పారిశుధ్య కార్మికులు చెప్తున్నారు. జూన్ నెలలో పిల్లలకు బడి ఫీజులతో పాటు దుకాణాల వద్ద అప్పుగా తెచ్చుకున్న నిత్యావసరాలకు డబ్బులు చెల్లించాలని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు.

అప్పు తెచ్చుకుంటున్నాం

కూటమి ప్రభుత్వం 6 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నిత్యావసరాలు దుకాణాల వద్ద అప్పుగా తెచ్చుకుంటున్నాం. కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి జీతాలను సకాలంలో అందించాలి.
– నరసప్ప, దేవరహట్టి పంచాయతీ

మాకు జీతాలు ఇవ్వాలి

చాలా సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నా. అయితే జీతాలు సక్రమంగా రావడం లేదు. గతంలో నెలకు రూ.6 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. నిత్యావసర ధరలు పెరిగాయి. కనీసం వేతనాలు పెంచి, సకాలంలో అందిస్తే కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుంది.
– శివన్న, తాళికెర పంచాయతీ

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

పెనుకొండ: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదామని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి. వాసుదేవన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కోర్టు భవనంలో గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం జరిగింది. ఈసందర్భంగా న్యాయమూర్తి బాల కార్మిక చట్టాలను వివరించారు. 18 ఏళ్లలోపు వున్న బాలలను పనుల్లో పెట్టుకోవడం కాని, విద్యకు దూరం చేయడం, వెట్టి చాకిరీ చేయించడం వంటివి నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బొజ్జప్ప, న్యాయవాదులు నాగిరెడ్డి, శ్రీరాములు, సుదర్శన్‌రెడ్డి, కోమల పాల్గొన్నారు.

పెనుకొండ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు సమతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాలో సమతా స్వచ్ఛంద సంస్థ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. ఇప్పటి వరకు ఈ రెండు జిల్లాల్లో సంస్థ ద్వారా 95 మంది బాల కార్మికులను రక్షించామన్నారు. 18 ఏళ్ల వరకు ఉచిత విద్య తప్పనిసరి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల కార్మికులకు పునరావాస నిధి ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మికుల సంఖ్య పెంచాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు, నాయకులు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీలో కార్మికుల సంఖ్య పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కరపత్రాలు విడుదల చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటేష్, సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ పెనుకొండ జనాభాతోపాటు విస్తీర్ణం పెరిగిందన్నారు. ఇందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగకపోవడంతో ఉన్న కార్మికులపై పనిభారం అధికమైందన్నారు. జనాభాకు సరిపడేలా కార్మికులను నియమించాలని, వేతనాలు పెంచాలని, కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. సీఐటీయూ నాయకులు గంగాధర్, తిప్పన్న, నరసింహ, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ కిట్లు అందజేయాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, బ్యాగులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి మండిపడ్డారు. గురువారం ఎంఈఓ గంగప్పకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. హిందూపురం పట్టణ వ్యాప్తంగా 114 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 12,598 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ మండలానికి ఒక్క బ్యాగు కూడా విద్యార్థులకు రాలేదన్నారు. అలాగే వీరికి 63,383 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా పూర్తిస్థాయిలో రాలేదన్నారు. ఈ రకంగా పాఠశాలలు ప్రారంభమైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, షూ ఇతర సామాగ్రి అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అనుదీప్, మహేంద్ర, రాజా, బాబావలి, ఆకాష్, విజయసింహ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు తహసీల్దార్‌గా నటరాజ్

చిలమత్తూరు: మండల తహసీల్దార్‌గా నటరాజ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ చేతన్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టకమునుపే ఇక్కడ మరో ట్విస్ట్ నెలకొంది. ప్రస్తుతం హిందూపురం తహసీల్దార్ వెంకటేష్ చిలమత్తూరుకు ఎఫ్‌ఏసీగా పనిచేస్తున్నారు. అయితే చిలమత్తూరుకు తనను రెగ్యులర్ చేయండని ఒత్తిడి తీసుకొస్తున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే పైరవీలు మొదలు పెట్టి తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్టుగా తెలుస్తోంది. తనను చిలమత్తూరుకు వేయండి.. లేకపోతే సొంత జిల్లాకు పంపండి అంటూ జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నట్టుగా తెలుస్తోంది. అయితే తహసీల్దార్ వెంకటేష్ ఏరోజూ బాధ్యతగా చిలమత్తూరుకు వచ్చింది లేదు. ఆయన వ్యవహారశైలి కూడా వివాదాస్పదమే. సమస్యలపై వచ్చిన వారితో దురుసుగా ప్రవర్తించడం, ఏ ఒక్క పని చేయకపోవడం వంటివి రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. పలు అవినీతి ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కొత్త తహసీల్దార్ బాధ్యతలు తీసుకుంటారా? లేక వెంకటేష్‌ను కొనసాగిస్తారా అనేది చూడాలి.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



అమరాపురం: వి.అగ్రహారంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులకు ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రీ స్కూల్‌కు వచ్చే చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. రోజు అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను తల్లులు పంపాలన్నారు. ఇక్కడ ఆటపాటలతో విద్యను అందిస్తామన్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

మడకశిరరూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లుమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం కార్యక్రమంలో సీడీపీఓ నాగమల్లేశ్వరి పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలు అక్షరాలు నేర్చుకుని విద్యావంతులు కావాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని డీహెచ్‌పీఎస్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులకు సిద్ధార్థ గౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారాలు గురువారం ప్రదానం చేశారు. దళిత పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను అందించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో పది, ఇంటర్, డిగ్రీలో ఈ ఏడాది అత్యంత ప్రతిభ కనబరచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ పురస్కారాలను మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ప్రదానం చేశారు. అంతకు మునుపు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి తర్వాత ఈ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



నివాళులర్పిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండలంలోని పీఎన్ పాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మారన్న (52) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పీఎన్ పాళ్యం చేరుకొని మారన్న మృతదేహానికి పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజన్న, గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో రైతులు బిజీ



దుక్కి చేస్తున్న రైతు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఇటీవల భారీ వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పంటల సాగులో నిమగ్నమయ్యారు. వ్యవసాయ భూముల్ని దుక్కి చేసి విత్తనం వేస్తున్నారు. మరో వైపు ఇంతకు ముందే వేరుశనగ సాగుచేసిన భూముల్లో వేరుశనగ కళకళలాడుతోంది. విత్తన సాగులో నిడుగల్ హోబళి మొదటి స్థానంలో ఉండగా, వైఎన్ హొసకోట హోబళి రెండో స్థానం, కసబ హోబళి మూడో స్థానం, నాగలమడక హోబళి చివరి స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు తాలూకా వ్యాప్తంగా ఈ ఏడాది వేరుశనగ పంట సాగు విస్తీర్ణత పెంచాలని ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో 33 వేల హెక్టర్ల వేరుశనగ సాగు విస్తీర్ణం లక్ష్యంగా పెట్టుకున్నారు. 8 వేల క్వింటాళ్ల వేరుశనగను సబ్సిడీపై అందిస్తున్నారు.

వేరుశనగ పంపిణీ ప్రారంభం

లేపాక్షి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఉదయం సర్పంచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో విత్తన వేరుశనగ నాయలు పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 978 మంది రైతులు 2,196 బస్తాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వ్యవసాయాధికారి శ్రీలత తెలిపారు. వీరందరికీ వేరుశనగ విత్తన కాయలు అందజేస్తామని పేర్కొన్నారు.

గోరంట్ల: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద గురువారం రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 1,603 క్వింటాళ్ల వేరుశనకాయలు వచ్చినట్లు ఏఓ మునికృష్ణ తెలిపారు. మండలంలో 996 మంది రైతులు విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం: పూలకుంటలోని రైతు సేవా కేంద్రంలో గురువారం మండల పరిధిలోని రైతులకు రాయితీ విత్తన వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. మొదటి రోజు 302.70 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు ఏఓ సురేంద్ర నాయక్ తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది దీప, అనిత, రాజేష్ పాల్గొన్నారు.

15న గోపుర కలశ స్థాపన

లేపాక్షి: మండలంలోని పి.సడ్లపల్లి గ్రామంలోని శివాలయంలో ఈనెల 15వ తేదిన గోపుర కలశ స్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 16న నవగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయాధికారి బదిలీ

చిలమత్తూరు: మండల ఏఓగా పని చేస్తున్న వంశీకృష్ణ అనంతపురం జేడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో మండల వ్యవసాయాధికారిణిగా కవితారాణి నియమితులయ్యారు. సోమందేపల్లిలో పని చేస్తున్న ఈమె బదిలీపై చిలమత్తూరుకు వచ్చారు.

ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వార్షికోత్సవం

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ మూడవ వార్షికోత్సవం గురువారం సిబ్బది ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఫీల్డ్ ఆఫీసర్ రఫీక్, వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విమాన ప్రమాద ఘటన చాలా బాధాకరం

మడకశిర: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటన బాధాకరమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈప్రమాదంలో 242 మంది మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సమయంలో మృతుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.

రొళ్ల: విమాన ప్రమాద దుర్ఘటన బాధాకరమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు గురువారం ఓ ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వంతో పాటు గుజరాత్ రాష్ట్రం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

డ్రోన్ ఉపయోగాలపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

లేపాక్షి: మండలంలోని కల్లూరు, లేపాక్షి రైతు సేవా కేంద్రాల్లో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం కేవీకే శాస్త్రవేత్త బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో డ్రోన్స్ ఉపయోగాలను వివరించారు. ఆధునిక పరికరాలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులను తెలియజేశారు.

కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



లోకాయుక్త అధికారికి ఫిర్యాదు చేస్తున్న రైతు

పావగడ: కర్తవ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, పనుల కోసం తాలూకా కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని బెంగుళూరు లోకాయుక్త ఇన్‌స్పెక్టర్ అడివేశ్ గోవికొప్ప స్థానిక తాలూకా కార్యాలయం అధికారులకు సూచించారు. ఆయన గురువారం తాలూకా కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత తహసీల్దార్ కార్యాయంలో రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ శాఖ లోని వివిధ విభాగాల్లో ఉద్యోగ సిబ్బంది బ్యాగులు, జేబులను సైతం పరిశీలించారు. రైతు హనుమంతరాయప్ప భూములకు సంబంధించిన అవకతవకలను లోకాయుక్త అధికారికి విన్నవించారు. అడివేశ్ గోవికొప్ప మాట్లాడుతూ తుమకూరు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులపై ఫిర్యాదులు చేయడంతో మొత్తం పది తాలూకాలోని తాలూకా కార్యాలయాల్లో ఏక కాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విలేకరులకు తెలిపారు.

వైభవంగా వాల్మీకి విగ్రహావిష్కరణ



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని పోతగానహళ్లి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహావిష్కరణ గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహిళలు గ్రామంలోని పోతప్ప ఆలయం నుంచి వాల్మీకి విగ్రహం వరకు కళశాలను మోశారు. ఉదయం నుంచే పూజలు, హోమాలు నిర్వహించారు. నిడుగల్ వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయకుమార స్వామి వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంజుల మంజునాథ్, పాళేగార్ లోకేశ్, దివాకరప్ప, మధుసూదన్ తదితర వాల్మీకి సంఘం నాయకులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వేణురెడ్డి హౌస్ అరెస్ట్



హిందూపురంలో వేణురెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

చిలమత్తూరు: రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో దళిత బాలికపై జరిగిన అత్యాచార ఘటన సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం పేరూరులో బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు రాష్ట్ర నేతలు హాజరు కావాల్సి ఉంది. అయితే పోలీసులు పేరూరుకు ఎవ్వరూ వెళ్లకుండా చేసేందుకు ఎక్కడికక్కడ నిర్బంధాలు, హౌస్ అరెస్ట్‌లు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. బాధిత కుటుంబానికి పరామర్శించేందుకు వెళ్లనీయకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని వేణురెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకుంటున్నారు. బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికను పెనుగొండ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

పాఠశాలలకు చేరని బ్యాగులు



గురువారం పాఠశాలలకు పుస్తకాలను తరలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: పాఠశాలలు తెరిచే రోజే విద్యార్థులకు పుస్తకాలు యూనిఫాం, బ్యాగులు అందజేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పింది. అయితే మండలంలోని 57 పాఠశాలలకు మాత్రం బ్యాగులు సరఫరా చేయలేదు. గురువారం కూడా కొన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు పుస్తకాలను తీసుకెళ్లారు. మండల వ్యాప్తంగా 3796 మంది విద్యార్థులకు బ్యాగులు ఇవ్వాల్సి ఉండగా సకాలంలో అందుతాయా అన్న అనుమానం తల్లి దండ్రులు వ్యక్తం చేస్తున్నారు. అయితే త్వరలో బ్యాగులు సరఫరా చేస్తామని ఎంఈఓ 2 ఆనంద్ బాబు తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలాలు



గుడ్డంపల్లిలో వికసించిన బ్రహ్మకమలాలు

మడకశిరరూరల్: మండలంలోని గుడ్డంపల్లి గ్రామంలో ఎల్ఐసీ ఏజెంట్ హనుమంతరాయప్ప ఇంటి ఆవరణలోని బ్రహ్మకమలం గురువారం సాయంత్రం వికసించింది. బ్రహ్మకమలం చెట్టుకు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.

గొర్రెలు, మేకలకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు

హిందూపురం: ప్రస్తుత సీజన్‌లో నీలి నాలుక వ్యాధి నివారణకు ఉచిత వ్యాధి నిరోధక టీకాలు వేయడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పశు వైద్య సహాయకులు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం తెలిపారు. గురువారం మండలంలోని బేవనహళ్లి రైతు సేవా కేంద్రంలో సన్నజీవాల పెంపకం-నీలి నాలుక వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. నీలి నాలుక వ్యాధి గొర్రెల్లో ఎక్కువగా కనిపిస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో మేకలతో పాటు ఇతర పశువులను కూడా ఇది ప్రభావితం చేస్తుందన్నారు. ఒకసారి వ్యాక్సిన్ ఇచ్చిన పశువుకు ఏడాది వరకు రక్షణ ఉంటుందన్నారు. అనుమానాస్పద లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక రైతు సేవా కేంద్రం పశువైద్యులను సంప్రదించాలన్నారు.